# బొమ్మ



పంతుల జోగారావు

నం చేసి వచ్చేటప్పటికి
' బాబు ఏడుపు తారస్థాయి
ఎ. చేతులూ కాళ్ళూ విదిలించు
ంటూ గుక్కతిప్పుకోకుండా ఏడుస్తున్నాడు. అరుణ గబగబావచ్చి చీరమార్చుకుని బాబుని చేతుల్లోకి తీసుకుంది.

'నా బంగారూ...నా తండ్రీ...నా పిచ్చి కన్నా....' ముద్దులు కురిపిస్తూ ఎక్కడ నుంచో తుర్రుమని వచ్చింది పదేళ్ళ కాంతి.

అరుణ నవ్వుతూ బాబుని భుజంమీద వేసుకుని అటూ యిటూ పచార్లు చేసింది.

తల్లి చేతి స్పర్శలోని మహత్తు ఏమిటోగాని బాబు ఏడుపు మానేసి చేతులాడిస్తూ నవ్వటం ప్రారంభించాడు.

బాబు హఠాత్తుగా ఏడుపు మానేయటంతో గాభరాపడి వర్ధనమ్మ గదిలోకి పరిగెత్తు కొచ్చింది 'ఏమిటే...ఏమయిందీ?' అంటూ.

'ఏం లేదమ్మా .... చూడు....దొంగ భడవ ఏడుపు మానేసి ఎలా ఆడుతున్నాడో!' నవ్వుతూ అంది అరుణ.

'బాగుంది! గుక్కతిరక్క ఉక్కిరిబిక్కిరయిపోయాడో ఏమోనని హడలి చచ్చేను .... పితూరీ దాసే సుమీ నీ కొడుకు!' అని నవ్వేసి తిరిగి తన పని చూసుకోవటానికి వంటింట్లోకి వెళ్ళిపోయింది వర్ధనమ్మ.

అరుణ కొడుకువేపు అపేక్షగాచూస్తూ ముద్దులు కురిపించింది.

'అక్కా బాబుని యివ్వవూ .... ఎత్తుకుంటాను....' చేతులు చాపుతూ అడుగుతోంది కాంతి.

"వద్దు కాంతీ....నలిపేస్తావు...."

"గొప్ప....ఏం కాదులే...ఎత్తుకుంటానుగా జాగ్రత్తగా .."

"వద్దు చెల్లీ... బాబు యింకా చిన్నవాడు కదా? నువ్వుకూడా చిన్న పిల్లవి. బాబు కొంచెం పెద్దవాడయ్యాక మీరిద్దరూ చక్కగా బొమ్మలాట ఆడుకోవచ్చును... ఏం?" అనునయిస్తూ చెప్పింది అరుణ.

కాంతి అసంతృప్తిగా ముఖంపెట్టింది.

"వెళ్ళి నీ బొమ్మ తెచ్చి ఆడుకోమ్మా కాంతీ....బాబుకి మరి నీ బొమ్మ చూపించవూ?" కాంతి దృష్టి మరల్చడానికి అంది అరుణ.

కాంతి ముఖం దిగులుగా తయారయింది. 'బొమ్మ లేదక్కా' అంది. ఆ పిల్ల కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"ఏమయిందే!"

"బావ దాని కాళ్ళు విరిచి పారేసాడక్కా." అరుణ ముఖంలో కోపం— అంతకు మరిన్ని రెట్లు జాలీ వరుసగా చోటు చేసుకున్నాయి. బాధగా క్రిందపెదవి కొరుక్కుంది.

"ఏదీ చూపించు" అంది చెల్లితో.

"అక్కడే, బావావాళ్ళింట్లోనే వదిలేసానక్కా - నిన్న వాళ్ళింటికి వెళ్ళి బావకి బొమ్మ చూపిస్తే నా చేతుల్లోంచి లాక్కుని - దాని కాళ్ళు పీకేసి కోపంగా మూలకి విసిరేసాడక్కా ... ఛీ ....బావ చెడ్డ కదూ? అల్లప్పుడూ ఇంతేనక్కా- తాటాకు బొమ్మలు తీసికెళ్తే రేకులు చింపేసి విసిరేసాడు .... " బావమీద అసహ్యం ఆ చిన్ని ముఖంలో స్పష్టంగా గోచరిస్తోంది.

"తప్పమ్మా అలా అనకూడదు.... బావకి మరి కాళ్ళు లేవుకదా....అందువల్ల కోపం ఎక్కువ....అంతే."

"కోపం అయితే నా బొమ్మ పాడు చెయ్యాలేంటి? నా బొమ్మ కాళ్ళు పీకేస్తే వాడికి కాళ్ళు వస్తాయేంటి?" ఆ చిన్ని మనసులో ఎంతపెద్ద ఆలోచన!

అరుణ బాధగా నిట్టూర్చింది. చెల్లెలికి ఏమని జవాబు చెప్పాలో ఆమెకి తోచ లేదు. తన ఉనికిని గుర్తుచేస్తూ బాబు మళ్ళీ కెవ్వుమన్నాడు.

అరుణ పాలు కలిపి సీసాలో పోసి వాడి నోటికందించింది. బాబు ఆత్రంగా అందుకుని పాలు త్రాగటం చాడు.

ముచ్చటగా చేతులు గడ్డకుని పాలు త్రాగుతున్న బాబున మంగా చూస్తున్న కాంతితో, 'అత్తా వాళ్ళింటికి వెళ్ళి ఆ బొమ్మ తీసుకురా చెల్లీ ... బాగవుతుందేమో చూస్తాను' అంది అరుణ.


"ఉహూఁ.... నేను వెళ్ళనక్కా" కాంతి బుంగమూతి పెట్టి అంది.

"ఫరవాలేదమ్మా....వెళ్ళు."

"నేను వెళ్ళనక్కా .... అత్తయ్య, మామయ్య, పెద్దబావ....అందరూ దేనికో ఒకదానికి పూరికే తిడుతూ వుంటారు.... రవి బావకి నేనంటేనే కోపం....ఎప్పుడూ గిచ్చడం....నా జడ పట్టుకుని గుంజడం చేస్తుంటాడు...."

కాంతిని ఎలా ఒప్పించడం? దాని చిన్నమనసుని గాయపరచిన ఆ యింటి వాళ్ళమీద అసహ్యం వేస్తోంది అరుణకి.. ఆ పసి హృదయాన్ని ఎంత తీవ్రంగా అవమానించారో . .ఇదక్కడకి వెళ్ళడానికే యిష్టపడటం లేదు .... తమ పట్ల వారికంత అనాదరణ ఎందుకు? లేమివల్ల కాదూ తమపట్ల వాళ్ళకా చులకన భావం?

వాళ్ళలాగ తమకి కారు లేకపోవచ్చు. మేడ లేకపోవచ్చు .... బాంక్ అకౌంట్ లేకపోవచ్చు. వాళ్ళ అబ్బాయిల్లాగా బి.ఎ. చదివిన తన తమ్ముడికి ఉద్యోగం లేకపోవచ్చు .... వాళ్ళలాగా తాము సుఖసంతోషాలతో బ్రతకలేక పోవచ్చు ... కానీ, రక్త సంబంధం అంటారే అదేమయింది? బంధువులమధ్య వుండాల్సిన



అనురాగం అనుబంధం .... యివే మయ్యాయి అరుణ మనసు దెబ్బతిన్న పావురంలా విలవిలలాడిపోయింది.

మంచి మాటలతో చివరకి చెల్లెల్ని సముదాయించి బొమ్మ తెచ్చుకో'మని పంపించింది

బాబు పాలుసగం త్రాగుతూనే నిద్ర లోకి ఒరిగి పోయాడు. బాబుని జాగ్రత్తగా ఎత్తుకుని ఉయ్యాలలో పడుకో బెట్టింది. ఉయ్యాలని కొంచెం వూపి అద్దం దగ్గరకి వెళ్ళి జుట్టు చిక్కు తీసుకుని జడవేసుకుంది. పౌడరు రాసుకుని కుంకుమ అద్దుకొని మరోమారు పరీక్షగా అద్దంలోకి చూసింది.

అద్దంకూడ తమ జీవితంలాగే ఎంత కళా విహీనమై పోయివుంది! అందులో కనిపించేది తన ప్రతిబింబమేనా? తనెంత పీక్కుపోయింది. ముఖంలో పూర్వపు ఉత్సాహం.... మెరుపు 'ఏమయిపోయాయో

"నిరాశలు....నిస్పృహలు....భయాలు ...బెంగలు...యివి మనని ఎంత త్వరగా వృద్ధులని చేస్తాయో. తెలుసా అరుణా! చూడు—నువ్వప్పుడే ఎంత ముసిలి దాని వయిపోయావో!"—భర్తమాటలు గుర్తు కొచ్చి అరుణ కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. రోజురోజుకీ దిగజార్చే ఆర్థిక పరిస్థితి తమది. మొదట్లో ఆయనది కాస్త మంచి ఉద్యోగమే. పెళ్ళయిన ఏడాదే ఆయన్ని ఉద్యోగంలోనుంచి తీసేసారు. తన తప్పేమీ లేదంటారాయన. తక్కిన వాళ్ళమాత్రం నీచంగా చెప్పుకుంటూ చెవులు కొరుక్కున్నారు. ఆ మాటలు తన చెవినికూడా పడి మనసు విలవిల లాడిపోయింది. ఆ ఉద్యోగం పోయాక రెండు నెలలు దుర్భరమయిన దరిద్రం అనుభవించాక బట్టల కొట్టులో గుమస్తాగా చేరారు. చాలీచాలని జీతం రాళ్ళు....ఎన్ని రాత్రుళ్లు తను పస్తులుండి

మంచి నీళ్లు త్రాగి సుష్టుగా భోజనం చేసినట్లు ముఖానికింత నవ్వు పులుముకో లేదు

ఇంతలో బాబు కడుపులో పడ్డాడు ఈ సంగతి ఆయనకి చెప్తే ఎగిరి గంతే స్తారనీ తనని వాటేసుకుని గిరగిరా త్రిప్పేస్తారనీ ముద్దులవర్షం కురిపిస్తా రనీ ఎంత తియ్యగా ఆశించింది తను నిర్లిప్తతని వ్యక్తం చెయ్యకుండా నిజం! ఎంత మంచివార్త? అని మాత్రం అనగలిగేరాయన

ఆక్షణంలో తనకి బ్రతుకంతా ఎండి పోయినట్లయింది బెంగల కొండ తన తలమీద వుంచినట్లు కన్నీటితో కరిగి పోయింది

వెక్కి వెక్కి ఏడుస్తూ ఆయన్ని వాటేసుకుంది

బెంగపడకు అరుణా ఫరవాలేదు ఒక్క బిడ్డని పోషించలేమూ? దీనంగా ఆయన తనని ఓదారుస్తూవుంటే తను చలించిపోయింది తన దుఃఖానికి కారణం అదెంతమాత్రం కాదని ఆయన కెలా తెలుస్తుంది ఒక్కరోజు ఒక్కగంట పోనీ ఒక్కక్షణం దిగుళ్ళు భయాలు జడిసిపోవటాలూ లేని ఒకే ఒక్కక్షణం కోసం తనెంత తపించిపోతోందో ఆయ నకి ఎలా వివరించి చెప్పగలదు తను!

తెరలు తెరలుగా వస్తున్న కన్నీటిని ఆపుకోడానికి ప్రయత్నిస్తూ పెట్టెతెరచి ఆయన వ్రాసిన ఉత్తరం చదివింది

బాబు నాపోలికేనని రాసావు బాబుకి రూపంలో నాపోలికవచ్చినా నా దురదృష్టం మాత్రం వాడ్ని వరించ కూడదు కదూ? విన్నూ బాబునీ వారం రోజులలో వచ్చి యిక్కడకు తీసు కొస్తాను డబ్బుకోసం ప్రయత్నాలు చేస్తున్నాను ఆరోగ్యం జాగ్రత్త


అరుణ మనసు దుఃఖంతో బరు వెక్కింది ఆయన పాపం డబ్బుకోసం ఎన్ని అవస్థలు పడుతున్నారో ఇక్కడ తన తండ్రి పరిస్థితి అంతే సెకండరీ గ్రేడు టీచరుగా ఆయనకివచ్చే జీతంతో యింత కుటుంబం గడవటమే అంతంత మాత్రంగా ఉంది ఆయనకి డబ్బు పంప మని తన నోటితో ఎలా చెప్పగలదు?

చూడక్కా ఇదిగో బొమ్మ బావ ఎంత పాడుచేశాడో చూడు కాంతి రాకతో ఆలోచనల నుంచి తేరుకుంది అరుణ బొమ్మ అందుకుని చూ ఎం ది ప్లాస్టిక్ బొమ్మ రెండు బుగ్గలు గాట్లుపడి పోయి వికృతంగా వున్నాయి కాళ్ళు రెండూ వూడబీకి పారేశాడేమో బొమ్మ రూపం చెడిపోయివుంది ఆ కాళ్ళు తిరిగి బొమ్మకి ఎలా అతకడమా అని ఆలోచి స్తోంది అరుణ

బొమ్మ యివ్వమంటే బావ కరి కొట్టేడే అక్కా బావమీద కోపం వెళ్ళ బోసుకుంది కాంతి

తన మాటలకి అక్క జవాబివ్వక పోవడంతో— ఛీ బావకి పొగరుకదూ?— అందుకే రెండు కాళ్ళూ పోయాయి— బావకి తగినశాస్తి జరిగిందిలే— అంటోంది కాంతి

చప్పున చెల్లెలి నోటిని అరచేత్తో మూసి— తప్పు కాంతీ! అలా అనవ చ్చునా? నీకు బావంటే జాలిలేదూ? నడవ




లేదుకదూ మనలాగ — బావ మంచివాడే చెల్లీ —కొంచెం పెంకి— అంతే

కాంతి మరేమీ మాట్లాడలేదు

అరుణ మనసుని చికాకు పెట్టే ఆలోచనలు చిందరవందరగా ముట్టడి చేసాయి

మొదట్లో అత్తా వాళ్ళది కూడా సామాన్య మయిన కుటుంబమే అప్పట్లో తమ కుటుంబమంటే ఎంతో అపేక్ష చూపించేవారు వాళ్ళంతా రవికి చిన్నప్పుడే పోలియో వచ్చి రెండు కాళ్లూ పడిపోయాయి వాడికి వైద్యం చేయించటం కోసం కొద్దిపాటి ఆస్తీ చెల్లిపోయింది కాని రవికి కాళ్ళుమాత్రం రాలేదు రవిని చూస్తే తనకు హృదయం తరుక్కుపోతుంది రోజూ వాడ్ని చూడటానికి వాళ్ళింటికి వెళ్ళందే ఉండలేకపోయేది రవికి కూడా తనంటే చాలా యిష్టం తను ఒక్కరోజు వెళ్ళకపోతే చాలా బాధ పడేవాడు

ఆ రోజుల్లో తనని పెద్దబావ మధూకి యిచ్చి పెళ్ళిచేదామని అంతా అనుకున్నారు కాని మధు ఎ యు ఎ మంచి మార్కులతో పాసవటంతో వాళ్ళ కుటుంబ పరిస్థితుల్లో పెద్ద మార్పు సంభవించింది బావకి మెడిసను సటువచ్చింది పట్టుదలతో అప్పులుచేసి మరీ చదివించారు వారి కలలు ఫలించి బావ డాక్టరయ్యాడు దానితో వాళ్ళ స్థితిగతులు బాగుపడ్డాయి అప్పులు తీర్చెయ్యడమే గాక ఓ కారూ మేడా కూడా కొన్నాడు

మరిచిపోయేడు తననీ చిన్నప్పుడు పెద్దలు తమ పెళ్ళిగూర్చి చేసిన ఆలోచనలనీ అత్తామామయ్యాకూడా సంపదతో వచ్చిన హోదాతోఅన్నీ మరిచిపోయారు— కనీసం అలా నటించారేమో

బావకి బాగా కలిగిన వాళ్ళ సంబంధం చూసి పెళ్ళి చేసేసారు.

ఎన్ని రాత్రులు తను రహస్యంగా కన్నీరు కార్చిందో? కాలం తన గాయాన్ని మాన్పు గలిగింది. రవిపట్ల తను పెంచు కున్న అనుబంధం మాత్రం తనని స్తిమితంగా ఉండనివ్వలేదు. ఇష్టంలేకపోయినా రవికోసమయినా సరే వాళ్ళింటికి వెళ్ళకుండా వుండలేకపోయేది—

కాని, అలా వెళ్ళినప్పుడు అత్తయ్య, మామయ్య తనపట్ల చూపే అలక్ష్యభావం తనని నిలువునా దహించివేసేది.

అన్నింటినీ సహించి-రవి దగ్గరకి వెళ్ళి వాడ్ని పలకరించి మాట్లాడేది.

తన అవిటితనానికి బాధపడుతూ-అనుక్షణమూ ఆవేదనచెందే వాడి కళ్ళలో నిరాశా నిస్పృహలు తాండవిస్తూ ఉంటాయి. ఆ దైన్యం తను చూడలేదు. వాడ్ని సంతోషపరచాలని ఎన్నో కబుర్లు చెప్పేది. ఆ నిరాశామయ జీవిలో గోరంత ఆశాబలం కలిగించాలన్న వ్యర్థప్రయత్నం తనది.

—ఇందుకు ఎన్ని ఆటంకాలు? తల్లికి తరచుగా తనక్కడికి పోవటం నచ్చదు. తండ్రి చాటుగా తిడుతూ వుంటాడు. అత్తయ్య మామయ్య వ్యంగ్యంగా ఎత్తి పొడుపు మాటలు విసురుతారు. బావ అదోలా చూస్తాడు. అతని భార్య-మణి తనని అసూయనిండిన కళ్ళతో మింగేసేలా చూస్తుంది.

కాని....కాని రవికోసం ఎన్ని అవమానాలనీ తను లెక్కచేయదు. ఆ అదృష్ట హీనుడికోసం తనొక వెచ్చని కన్నీటి బొట్టు విదల్చటానికి కూడా ఎన్ని ప్రతిబంధకాలు.

....తనకి పెళ్ళయింది. క్రొత్త జీవితం ప్రారంభించాక జీవవాహిని ప్రవాహవేగానికి తట్టుకోలేక సతమతమవుతూ ఉండటంలో సహజంగానే రవి గురించిన ఆలోచనలకు ప్రాధాన్యత కొంచెం తగ్గింది.

తమ బాధలు .... ఇబ్బందులు .... ఇంతలో బాబు పుట్టడం జరిగింది. మూడు నెలలుగా రవిని చూడటానికే వీలుపడలేదు. ఇక్కడకు రాగానే ఒక్కసారి మాత్రం వెళ్ళి చూసి వచ్చింది. అంతే.

ఇవాళమాత్రం రవినిగురించిన ఆలోచనలు తనని అమితంగా వేధిస్తున్నాయి. "ఆ మందభాగ్యుడ్ని ఓసారి చూసి వస్తేనో" అనిపిస్తూ ఉంది.

ఆలోచిస్తూ బొమ్మకి కాళ్ళు అతికించే ప్రయత్నంలో ఉన్న అరుణచేతికి సూది గుచ్చుకుంది. బొట బొటమని రక్తపు బిందువులు రాలేయి.

"అమ్మో, రక్తం!" కాంతి భయంగా చూసింది. "అబ్బా!" బాధగా నిట్టూర్చి బొమ్మ ప్రక్కనే పడేసింది అరుణ.

"బొమ్మకి కాళ్ళు మరి అతకబడవు కదూ అరుణక్కా .." కాంతి అడుగుతోంది.

* * *

ఆ ఉదయం మంచిరోజని చెప్పి, బాబుని యిల్లు బయలుదేరించారు. వర్ధనమ్మ, అరుణ కలసి బాబుని తీసికొని కోవెలకి వెళ్ళి వచ్చారు.

సాయంత్రం వర్ధనమ్మ యిస్త్రీ చీర

కట్టుకుని, బాబుకి కూడా జుబ్బా తొడిగించి-"అరూ! బాబుని మీ అత్తా వాళ్ళింటికి తీసికెళ్తున్నాను-నువ్వు రాకూడదూ?" అనడిగింది

"నేను రాలేనమ్మా అదీకాక బాబు నెందుకు తీసికెళ్ళటం?" అయిష్టంగా అంది అరుణ

"బాగుండదమ్మా మనలో మనకు ఎన్ని మనస్పర్థలున్నా యిలాంటి ఆచారాలు మానకూడదమ్మా ఎవరయినా ఏం అనుకుంటారు? మీ అత్తవచ్చి బాబుని చూపి వెళ్ళలేదూ? మనకోసం కాకపోతే పదిమందికోసమే అనుకో బాబుని ఇల్లు కదిలించేక ఓసారి తీసుకురమ్మని ఆవిడ చెప్పింది కూడా—"


"ఆఁ చెప్పిందిలే నువ్వు ఉత్త సత్యకాలపు మనిషివమ్మా-ఏదో ముఖం తుడుపుకి అలా రమ్మందే తప్ప—నువ్వు వాడ్ని తీసికెళ్తే నీ ముఖంమీదే చీదరించుకుంటుంది చూడు—" అరుణ నచ్చచెప్పబోయింది

"నీకు తెలీదులే వూరుకో" అని విసుక్కుని వర్ధనమ్మ బాబుని తీసుకుని వెళ్ళిపోయింది.

రవిని చూడ్డానికి వెళ్ళాలని మనసు ఆత్రత పడుతున్నా ఆ కోరికను అణుచుకుంది అరుణ

* * *



సాయంత్రం ఏడుగంటలవుతున్నా వర్ధనమ్మ యింటికి తిరిగిరాలేదు అరుణ గాభరా పడసాగింది ఆలస్యమవుతున్న కొద్దీ ఆమె ఆందోళన ఎక్కువ కాసాగింది అమ్మ యింకా రాలేదేం? ఏమిటయిందో వెళ్ళవద్దంటే విందా? భయంతో అరుణకి చెమటలు పోయసాగాయి.

ఇంతలో ఎవరో అబ్బాయివచ్చి, "అరుణక్కగారూ - మీ అమ్మగారు మిమ్మల్ని వెంటనే తీసుకురమ్మన్నారండీ-యింటికి తాళం వేసి మధు డాక్టరుగారింటికి వచ్చెయ్యమన్నారండీ——" అని చెప్పాడు

రకరకాలయిన ఆలోచనలు చుట్టుముట్టి అరుణ గజగజమని వణికిపోయింది ఆమె శరీరమంతా చెమటతో తడిసి ముద్దయిపోయింది తమ్ముడుకూడా సమయానికి యింట్లోలేడు తండ్రి వూర్లో లేరు ఏం చెయ్యడానికీ తోచలేదు అరుణకి వణుకుతున్న చేతులతో ఎలాగో తలుపుకి తాళంపెట్టి, కాంతితో సహా రిక్షా ఎక్కింది దారిపొడుగునా ఆమెని భయంగొలిపే ఆలోచనలు చుట్టుముట్టాయి

"ఒకవేళ ఒకవేళ-రవి-తన బాబునేమీ చేసెయ్యలేదు కదా? బాబుకేమయిందో తన బాబుకి కాలో చెయ్యో విరిచేసాడేమో " ఈ ఆలోచనరాగానే నిలువునా కంపించిపోయింది అరుణ దుఃఖంతో ఆమె గుండె బ్రద్దలయేలా ఉంది ఆమె కళ్ల వెంట నీళ్లు ఉప్పెనలా ఉబికి వస్తున్నాయి బాధతో విలవిలలాడిపోతూ ఆయాసంతో రొప్పుతోంది

"శనివెధవ రవిగాడు ఆ పాపిష్ఠి వెధవ నా బాబునేంచేసాడో? భగవంతుడా! నా కన్నతండ్రిని కాపాడు స్వామీ వాడి బ్రతుకు పాడుగాను - తనకి కాళ్లులేవని చెప్పి-ఇంకొకళ్లని చూసి ఓర్చుకోలేని కిరాతకపు వెధవ-నా బాబునేం చేసాడో-

వాడికి చావురాదా? భగవాన్ నీవే శరణు! రక్షించు తండ్రీ!" ఆ క్షణంలో ఆమె మ్రొక్కని దేవుళ్ళు లేరు

రిక్షా ఆగింది

మెట్లమీద అడుగుపెడ్తూనే ఇంక దుఃఖాన్ని భరించలేక భళ్లున ఏడుస్తూ లోనికి పరిగెత్తింది అరుణ లోపల అంతా హడావిడి పడుతున్నారు మధు మంచంమీదికి వంగి ఇంజక్షన్ ఇస్తున్నాడు

అరుణ ఏడుస్తోందే తప్ప—కన్నీటి తెరలతో నిండిపోయిన ఆమె చూపులకి అంతా గందరగోళంగా, అయోమయంగా కనిపిస్తోంది తనేం చేస్తోందో, ఏం చేయాలో తెలుసుకోలేని స్థితిలో ఉందామె

"అరుణా వచ్చావా? ఇదుగ బాబుని అందుకో" తల్లి మాటలు వినిపించి అటు చూపింది అరుణ అమ్మ! ఆవిడ చేతిలో బాబు కొండంత దిగులు మంచులా కరిగిపోయినట్టయిందామెకు ఆత్రంగా బాబుని అందుకుని గుండెలకు బలంగా, ఉద్వేగంగా హత్తుకుంది

ఆ తరువాత ఆమె మామూలు స్థితికి రాగలిగింది.

"రవికి ఉదయంనుంచీ జ్వరమమ్మా సాయంత్రం నేనిక్కడకు వచ్చేసరికే అంతా గాభరాపడుతున్నారు " స్వరం తగ్గించి అరుణతో చెప్పింది వర్ధనమ్మ

అరుణ త్రుళ్లిపడింది ఆమె మనసు మీద పిడుగులు పడ్డట్లయింది ఆ మాటలు వినేసరికి ఛీ తనెంత పాపిష్టిది? రవి

రవి గూర్చి ఎంత నీచంగా ఎంత వికృతంగా ఆలోచించింది తను? తనలో సంస్కారం ఏమయిపోయింది? రవిపట్ల ఇన్నాళ్ళూ తనకిగల దయ, సానుభూతీ, ప్రేమా—అన్నీ కపటమైనవేనా! అయ్యో రవీ! చిన్నవాడివయినా నన్ను క్షమించవయ్యా-నేను మోసగత్తెను మూర్ఖురాల్ని" ఆమె హృదయం బాధతో ఆక్రోశించింది

గుండె దిటవు పరచుకుంటూ మంచం దగ్గరకి వెళ్లి దుఃఖాన్ని పెదిమల మధ్య బంధించి అంది "రవీ రవి బాబూ చూడవూ? ఒక్కసారి పిచ్చి తండ్రీ చూడవ్?"

రవి ప్రయత్నంమీద కష్టంగా కనురెప్పలు తెరచి ఆమెవేపు చూసాడు వాడి కళ్లు తీవ్రమయిన జ్వరంతో నిప్పు కణికెల్లా వెలిగిపోతున్నాయి

అరుణని చూసి నవ్వటానికి ప్రయత్నిస్తూ "వదినా వచ్చేవా "అన్నాడు లోతుస్వరంతో

"వచ్చేనుబాబూ అన్నట్టు ఇదిగో రవీ! బాబు !బాగున్నాడా?"

"ఓ చాలా బాగున్నాడు వదినా బాబు, ముద్దుగా బొమ్మలాగా ఎంత బాగున్నాడని!, " ఆ తరువాత జ్వర తీవ్రత వాడినింక మాట్లాడ నివ్వలేదు బరువుగా వాడి కనురెప్పలు మూతలుపడిపోయాయి ఎవరో అరుణని అక్కడ్నుంచి ప్రక్కకి తీసికెళ్ళారు

మర్తో అరగంటలో ఆ ఇల్లు ఒక్కసారిగా ఏడుపులతో మారుమ్రోగి పోయింది రవి మూసిన కళ్ళు మరి తెరవలేదు!

అరుణ బావురుమంది దుఃఖంతో గుండెలు బ్రద్దలయ్యేలా విలపించింది

"బాబు ముద్దుగ్గా— బొమ్మలాగా— ఎంత బాగున్నాడని!", అన్న మాటలు కోటి ఫిరంగి ధ్వనులై ఆమె మనసులో తీవ్రంగా ప్రతిధ్వనిస్తున్నాయి □